29 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఈనెల 29వ తేదీ నుంచి విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ధర్మవరం పట్టణంలోని విత్తన ప్రాసెసింగ్ యూనిట్, మండలంలోని దర్శనమల రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన ప్రాసెసింగ్ యూనిట్లో వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ ఎలా జరుగుతుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. విత్తన నాణ్యత, ప్రాసెసింగ్ విత్తనం మొలకెత్తడం కోసం పెట్టిన జర్మినేషన్ ట్రేస్‌ను, వేరుశనగ విత్తనాల మొలక శాతంను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ నుంచి వేరుశనగ విత్తన పంపిణీని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించామన్నారు. జిల్లాకు వేరుశనగ విత్తన కాయలు ధర్మవరం, కదిరి పట్టణాల్లోని సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి, అనంతపురం జిల్లాలోని సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

సివిల్స్‌లో కదిరి విద్యార్థికి 270వ ర్యాంక్

తల్లిదండ్రులతో ఉమామహేశ్వరరెడ్డి

ఉమామహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన విద్యార్థి సివిల్స్‌లో సత్తా చాటాడు. కదిరికి చెందిన బొల్లం ఉమామహేశ్వర్ రెడ్డి 270 ర్యాంక్ సాధించారు. తండ్రి రాజశేఖర్ రెడ్డి కదిరి బాలికల జూనియర్ కాలేజీలో అధ్యాపకునిగా, తల్లి పద్మావతి ప్రభుత్వ పాఠశాలల్లో ఫిజికల్ సైన్స్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. ఉమామహేశ్వరరెడ్డి 2016లో హైదరాబాద్ లో ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవల జరిగిన సివిల్స్ పరీక్ష రాసి 270వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ అమేజాన్ కంపెనీలో మూడు సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. ఇక్కడ ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు చదువుకుంటూ అందులో 270వ ర్యాంకు సాధించాడు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు వైద్యసిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నాడు మండల పరిధిలోని దర్శనమల పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులు నిరీక్షించు గది, రక్త పరీక్ష కేంద్రం, లేబర్, మందు నిల్వ గదులను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజు ఓపీ ఎంతవరకు వస్తుంది.? పిహెచ్‌సిలో చేసే వైద్య సేవలు ఏమిటి అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో మెడికల్ ఆఫీసర్ పుష్పలత ప్రతిరోజు 60–80 వరకు రోగులు వస్తున్నారని, జబ్బుకు తగ్గ మందులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. రోగుల ద్వారా ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చక్కటి వైద్యాన్ని అందించే బాధ్యత వైద్యులు, సిబ్బందిదే అని తెలిపారు. రక్త పరీక్షలు కూడా సక్రమంగా, నాణ్యతగా చేయాలని సూచించారు. రోగ నివారణలో అందరూ మంచి వైద్యాన్ని అందించినప్పుడే పిహెచ్‌సి మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

దర్శనమల రైతు భరోసా కేంద్రం తనిఖీ

దర్శనమల గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రానికి 100 క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేయడంతో పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తనం నాణ్యతగా ఉందా లేదా అని రైతులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో తిప్పేనాయక్, డిఎంఅండ్‌హెచ్‌ఒ కష్ణారెడ్డి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ సెల్వియా సాల్మన్, జిల్లా వ్యవసాయ అధికారి వై వి సుబ్బారావు, మెడికల్ ఆఫీసర్ పుష్పలత, తహశీల్దార్ యేగేశ్వరిదేవి, ధర్మవరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కష్ణయ్య, ఏపీ సీడ్స్ మేనేజర్ ధనలక్ష్మి, వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి, ఎంపీడీవో మమతాదేవి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ షురూ

◆ నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

◆ డిఇఒ ఎం.సాయిరామ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల బదిలీలు నిర్ణీత తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.సాయిరామ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

బదిలీల షెడ్యూల్:

ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 25 నుండి 27వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 28 నుంచి 29 వరకు ప్రొవిజినల్ సీనియార్టీ జాబితా విడుదల, 30న అభ్యంతరాల స్వీకరణ, 31, జూన్ 1 వరకు అభ్యంతరాల పరిష్కారం, జూన్ 2 నుండి 3 వరకు వెబ్‌సైట్‌లో అర్హత పాయింట్లతో పాటు ఫైనల్ సీనియారిటీ జాబితాలు పొందుపరచడం, 4న ఖాళీలు చూపడం, 5 నుండి 8 వరకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆన్లైన్లో ఆప్షన్ ఇవ్వడం, 9 నుంచి 11 వరకు జాబితా తయారు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకే పాఠశాలలో 5 సంవత్సరాలు పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, 8 సంవత్సరాలు పూర్తయిన ఇతర ఉపాధ్యాయులందరూ తప్పని సరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్‌ప్లస్ అయిన ఉపాధ్యాయులందరూ సబ్జెక్టు కన్వర్షన్ పాఠశాల సహాయకులందరూ తప్పని సరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసంబద్ధమైన, తప్పుడు ధ్రువపత్రాలు ఏవైనా సమర్పిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

నేటి నుంచి ఏపీ ఐసెట్-23 పరీక్షలు

◆ నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

◆ ఏపీ ఐసెట్-23 ఛైర్మన్ రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, ఎపిఎస్‌సిహెచ్‌ఇ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఐసెట్–23 పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేసినట్లు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, ఏపీఐసెట్–23 ఛైర్మన్ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 24వ తేదీ బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ పరీక్షకు 24,298 మంది విద్యార్థినులు, 24,864 మంది బాలురు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రెండు రాష్ట్రాల్లో పరీక్షల కోసం 111 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9:00 నుండి 11:30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3:00 గంటల నుంచి 5:30గం॥ల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలు రాయాల్సి ఉంటుందన్నారు. అన్ని ప్రశ్నలకు నాలుగు బహుళ ఎంపిక సమాధానాలు ఉంటాయన్నారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారికి అందిన హాల్‌టికెట్లలో వివరాలు సరిగా ఉన్నావో లేదో పరిశీలించుకోవాలన్నారు. ఏదైనా వ్యత్యాసం ఉంటే ఏపీఐసెట్–2023 హెల్ప్ లైన్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. హాల్‌టికెట్ లేని విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించరన్నారు. అభ్యర్థులు గుర్తింపు కార్డు కోసం పాస్‌పోర్టు, ఓటరుకార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవీ తీసుకురాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పి.మురళీకష్ణ, ఎవి.రమణ, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ రఘునాథరెడ్డి, డాక్టర్ కె.రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

పేదలకు ఒకలా... పెద్దలకు మరోలా..!

◆ 'పురం'లో అక్రమ నిర్మాణాల్లో ద్వందనీతి

◆ పేదల నిర్మాణాలు నిమిషాల్లో తొలగింపు

◆ పెద్దల భవనాలపై కన్నెత్తి చూడని అధికారగణం

ఇందిరమ్మ సర్కిల్‌లో ఓ వ్యాపారి మురుగు కాలువను ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణం

ప్రజాశక్తి-హిందూపురం

ఎంతో చరిత్ర కలిగిన హిందూపురం పురపాలక సంఘంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు వైస్ ఛైర్మెన్లు, 26 మంది అధికార పార్టీ కౌన్సిలర్లు, ఆరుగురు ప్రతిపక్ష టిడిపి, ఒక బిజెపి, ఒక ఎంఐఎం కౌన్సిలర్లు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంత మంది ఉన్నప్పటికీ బడుగు బలహీన నిరుపేదల సమస్యల గురించి ఏ ఒక్క మున్సిపల్ సమావేశంలో మాట్లాడిన దాఖలాలు లేవు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం... అజెండాను ఆమోదం చేసుకుని సమావేశాన్ని మమ అనిపించడం పరిపాటిగా మారింది. పట్టణంలో ప్రధాన వీధుల్లో పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇళ్లు లేని పేదలు ఎక్కడైనా జానెడు స్థలంలో గుడిసెలు వేసుకుంటే అధికారులు క్షణాల్లో అక్కడికొచ్చి వాటిని తొలగించేస్తున్నారు. వ్యాపారులు, రాజకీయ నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్నా మిన్నకుండిపోతున్నారు. హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని రహమత్‌పురం, ఆబాద్‌పేట, ముక్కిడిపేట హస్నాబాద్, మేళాపురం తదితర ప్రాంతాల్లో ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను అధికారులు జెసిబిలతో ఇటీవల తొలగించారు. పేదల కాలనీల్లో పరిస్థితి ఇలా ఉంటే జన సముదాయాలు ఎక్కువగా ఉండే ప్రధాన రహదారుల్లో బడా వాణిజ్య సముదాయ భవనదారులు మురుగు కాలువలు, రోడ్లను ఆక్రమించుకుని నిర్మాణలు చేస్తున్నా వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

పేదలపై ప్రతాపం..!

శ్రీ సత్యసాయి జిల్లాలోనే అతి పెద్ద పట్టణం హిందూపురం పురపాలక సంఘం. జిల్లాలోనే ఎక్కువ జనాభా కలిగిన పట్టణం సైతం ఇదే... ఇటీవల కాలంలో చిన్నచిన్న పురపాలక సంఘాల్లో సైతం ప్రత్యేక కార్యాచరణ తీసుకుని ప్రధాన రహదారుల్లో ఉన్నటువంటి ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అయితే హిందూపురం పురపాలక సంఘంలో దీనికి విరుద్ధంగా ఉంది. ఈ మున్సిపాల్టీలో

మారుతీ కాంప్లెక్స్ నిర్వహకులు కాలువను, రోడ్డును ఆక్రమించుకున్న చేసిన నిర్మాణం

పేదలపై ప్రతాపం చూపుతూ ఆక్రమణలంటూ వారి నిర్మాణాలను తొలగించేస్తున్నారు. పెద్దల భవనాల జోళికెళికి మాత్రం వెళ్లడంలేదు. జిల్లాలోని అతిపెద్ద మురికివాడ అయినా రహమత్‌పురంతో పాటు పేదలు నివాసముంటున్న ఆబాద్‌పేట, ముక్కడిపేట, హస్నాబాద్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలపై చిన్న చిన్న స్నానపు గదులు నిర్మాణం చేసుకున్న వాటిని మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అంటూ తొలగించారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత పేదల నిర్మాణాలపై మరింత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారు. వార్డుల్లో ఎక్కడైనా చిన్నచిన్న ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే వెంటనే సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు అక్కడికి వాలిపోయి నోటీసులు ఇచ్చేస్తున్నారు. నిర్మాణానికి అనుమతులు లేవంటూ వెంటనే వాటిని ఆపించేస్తున్నారు. ఇది కేవలం పేదలు నిర్మించే చిన్నచిన్న ఇళ్ల నిర్మాణాలపై మాత్రమే జరుగుతోంది. పెద్దపెద్ద భవనాలు కళ్లెదుటే నిరభ్యంతరంగా నిర్మాణాలు జరిగిపోతున్నాయి.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..!

హిందూపురంలో నిత్యం రద్దీగా ఉండే ఇందిరమ్మ సర్కిల్‌లో ఓ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఇది అద్దెకు తీసుకున్న వారు మురుగు కాలువతో పాటు రోడ్డును సైతం ఆక్రమించుకున్నారు. దీని పక్కనే మారుతీ షాపింగ్ కాంప్లెక్స్, నూతనంగా నిర్మాణం చేసుకున్న బేకరీ షాప్ వారు కాలువలు, రోడ్డును ఆక్రమించుకున్నారు. ఇలా చెప్పుకుంటు పోతే పట్టణ పరిధిలోని బెంగళూరు రోడ్డు, పెనుకొండ రోడ్డు, ఆర్‌పిజిటి రోడ్డులో ఆక్రమణలు అనేకం కన్పిస్తాయి. వీటిపై మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఆర్‌పిజిటి రోడ్డులో ఒక ప్రముఖ వైద్యుడు తేజా నర్సింగ్ హోం పేరుతో రోడ్డును ఆక్రమించుకుని ఎటువంటి అనుమతులు లేకున్నా విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకున్నప్పటికీ వారికి ఎటుఇంటి నోటీసులూ ఇవ్వలేదు. రహదారులను ఆక్రమించుకున్న వారు కౌన్సిలర్లకు సైతం మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వారు కౌన్సిల్ సమావేశంలో ఆ ఆక్రమణలపై చర్చించడం లేదన్న వాదనలు వినపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి పెద్దల ఆక్రమణలు తొలగించక పోతే పాలకులు, అధికారులు కలిసి పెద్దల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుని తొలగించడం లేదన్న ఆరోపణలు అక్షర సత్యం అవుతుందని పురం ప్రజలు భావిస్తున్నారు.

పప్పు, చిరుధాన్యాల సబ్సిడీ ఖరారు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్‌కు పప్పుధాన్యాలు, చిరుధాన్యాల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారయ్యారు. 30 శాతం సబ్సిడీతో విత్తనాల ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. మినుములు కిలో అమ్మకం ధర రూ.117.50 కాగా, 30 శాతం సబ్సిడీ అంటే కిలోపై రూ.35.25 ఇవ్వనున్నారు. రైతు కిలోకు రూ.82.25 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు కిలోల చొప్పున ఒక్కో ప్యాకెట్ ఉంటుంది. అర ఎకరానికి ఒక ప్యాకెట్ చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాలకు పది ప్యాకెట్లు సబ్సిడీతో ఇవ్వనున్నారు. పియు–31, ఎల్‌బిజి–752, ఐపియు 2–43, టిబిజి–104 రకాలు పంపిణీ చేయనున్నారు. పెసలు ఐపిఎం2, –14, ఇతర రకాలు కిలో ధర రూ.117.50 సబ్సిడీ రూ.35.25 సబ్సిడీ ఇవ్వనున్నారు. రైతు రూ.82.25 కిలో చొప్పున ఇవ్వనున్నారు. కందులు ఎల్‌ఆర్‌జి–52, ఐసిపిఎల్–87119 కిలో రూ.111.14 చొప్పున సబ్సిడీ రూ.33.42 ఇవ్వనున్నారు. రైతు వాటాగా రూ.77.89 కిలోకు చెల్లించాలి. ఐసిపిహెచ్–2740 పూర్తి ధర రూ.128 కిలో పూర్తి ధరకాగా రూ.38.40 సబ్సిడీ ఇవ్వనున్నారు. రూ.89.60 కిలోకు రైతు వాటాగా చెల్లించాలి. నాలుగు కిలోలు, రెండు కిలోల ప్యాకెట్లు అర ఎకరానికి ఒకటి, ఐదు ఎకరాలకు అవుతే పది ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.

50 శాతం సబ్సిడీతో చిరు ధాన్యాలు

చిరుధాన్యాలకు సబ్సిడీని కొంత పెంచారు. 50 శాతం సబ్సిడీతో చిరుధాన్యాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొర్ర ఎస్ఐఎ–3156 రకం పూర్తి ధర కిలోకు రూ.67.50 కాగా 50 శాతం సబ్సిడీతో అంటే సబ్సిడీ రూ.33.75 కాగా రైతు వాటా ధర రూ.33.75. ఇక రాగికి ఇంద్రావతి రకం ఇవ్వనున్నారు. దీనికి కూడా 50 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నారు. దీని ధర కూడా కిలో రూ.69.50 కాగా, సబ్సిడీ రూ.34.75 కాగా ,రైతు తన వాటాగా రూ.34.75 చెల్లించాల్సి ఉంది. ఇవి రెండు కిలోల ప్యాకెట్లను ఒకటి నుంచి ఐదు వరకు ఇవ్వనున్నారు. వీటితోపాటు సాములు, అరికెలు, ఊదలు, అండుకొర్ర తదితర చిరు ధాన్యాలను పంపిణీ చేయనున్నారు. వీటి కేటాయింపులు కూడా ఇది వరకే జరిగి ఉన్నాయి. వీటితోపాటు వరి ధాన్యం కూడా పంపిణీ చేయనున్నారు. వరిధాన్యం అర ఎకరానికి అయితే 25 కిలోలు, 30 కిలోల ప్యాకెట్ అర ఎకరానికి ఒకటి, ఐదు ఎకరాలకు గరిష్టంగా నాలుగు ప్యాకెట్లు అందజేయనున్నారు. ఈ విత్తన పంపిణీకి అధికారులు వేరుశనగతోపాటే ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

30 శాతం రాయితీతో పంపిణీ

రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ తరువాతే పంపిణీ

రైతు భరోసా కేంద్రాల్లో వీటిని కూడా రిజిస్ట్రేషన్‌ను ముందుగానే రైతులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే వేరుశనగ పంటకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇక పప్పుధాన్యాలు, చిరుధాన్యాలకు సంబంధించి కూడా అదే పద్ధతుల్లో సాగు విస్తీర్ణం బట్టి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోపాటు తమవాటా డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఆయా గ్రామాల పరిధిలోనే పంపిణీ చేయనున్నారు.

నష్టపోయిన పండ్లతోటల రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి బత్తలపల్లి

వర్షాలు, వడగండ్లు ఈదురు గాలులకు దెబ్బతిన్న పండ్లతోటల నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధిత రైతులకు పంట నష్టపరిహారం అందేలా చూస్తామని జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి ఛైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ బాధిత రైతులకు హామీ ఇచ్చారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం,ఈదురుగాలులకు పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి ఛైర్మన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారులు మంగళవారం మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి, గోవిందరెడ్డి 10 ఎకరాలలో సాగు చేసి నష్టపోయిన అరటిపంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులతో వారు మాట్లాడుతూ దిగుబడి చేతికి దక్కే సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నోటికి అందకుండా పోయిందని అనానరు. ప్రభుత్వం నుండి ఆదుకునే చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు.ఉద్యాన శాఖ అధికారులు పంటనష్టాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపుతారని తాము ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పంట నష్టం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఇ ఓబిరెడ్డి, ఆర్‌బికె విఎఎ నిఖిత, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

నాయకులు,కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషిచేయితాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శ్రీసత్య సాయి జిల్లా మడకశిర పట్టణం టిడిపి కార్యాలయం వద్ద మంగళవారం ఐ.టి.డి.పి నాయకులతో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయడానికి ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సుబ్బరాయుడు, సీనియర్ నాయకుడు కొంకల డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి అరెస్ట్‌కు అడ్డుపడటం ఎందుకు..?

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్ట్ కాకుండా అడ్డుపడటం వెనుకున్న రహస్యం ఏమిటో సీఎం చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ తన సీటు కోసం అవినాష్ రెడ్డి, తన సీఎం పదవి కోసం జగన్ రెడ్డి వివేకా హత్యకు కారణమయ్యారని ఆరోపించారు. దోషులు, కుట్రదారులు చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. టీడీపీ నేతలు, మాజీ మంత్రులను అరెస్ట్ చేయడానికి సీఐడీ గొడలు దూకవచ్చా అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలన్నారు. అరెస్టు భయంతోనే అవినాష్ రెడ్డి సాకులు చెబుతున్నారని తెలిపారు. బాబాయ్ హత్య కేసులో వాస్తవాలు చెబితే మీడియాపై దండయాత్ర చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, త్రివేంద్ర నాయుడు, మారుతి ,వాసుదేవరెడ్డి, వీరచిన్న, మణికంఠ సానిపల్లి వెంకటేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

'బెదిరిస్తే చూస్తూ ఊరుకోం...'

ధర్మవరం టౌన్ : అమాయకులపై దాడులు, దౌర్జన్యాలు ద్వారా కార్యకర్తలను భయ భ్రాంతులకు గురిచేయాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని అసలు, వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డులలో గల 104 పోలింగ్ కేంద్రాలలో ప్రతి వార్డుల్లోనే వార్డు కమిటి సమావేశాలను ఏర్పాటుచేసి రాబోవు సార్వత్రిక ఎన్నికలను దష్టిలో ఉంచుకొని పోలింగ్ బూత్ కమిటీ, సెక్షన్ ఇన్‌ఛార్జి నియామకం త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఫణికుమార్, బోయరవిచంద్ర, పరిశేసుధాకర్, నాగూరుస్సేన్, కొత్తపేట అది, గోసలశ్రీరాములు, బీరే శ్రీనివాసులు, అత్తర్ రహీంబాషా, కేతినేని రాజ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి ఇంటి ముందే ఇలా..

ఇక గ్రామంలో ఎలా..?

సర్పంచి ఇంటిముందు రోడ్డులో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి. నల్లమాడ

మండల పరిధిలోని నల్లగొండ ఎనుములవారిపల్లిలో సర్పంచి ఇంటిముందరే నిల్వ ఉన్న మురుగు నీటికుంటను తలపిస్తోంది. సర్పంచి రెడ్డమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఇంటిలో నుంచి బయటకు రావాలన్నా, బయట నుంచి ఇంటిలోకి వెళ్లాలన్న మురుగు నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీరితోపాటు గ్రామస్తులందరూ ఈ మురుగునీటి మడుగు లో వెళ్లడం పరిపాటిగా మారింది. కొద్దిపాటి వర్షానికే ఈ వీధి అంతా మరుగునీటి మడుగులా తయారవుతోందని ఆ వీధి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచి నివాసముండే ఈ ప్రాంతంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఈ మురగునీరు ఇలానే ఉంటే దోమలు వృద్ధి చెందిన ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఈ వీధిలో సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు కాగా రోడ్డు ఏర్పాటుకు సంబంధించి సంబంధిత కాంట్రాక్టర్ మెటీరియల్ కూడా సిద్ధం చేశాడు. అయితే సిమెంట్ రోడ్డు నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని సర్పంచి రెడ్డమ్మ, ఆమె మామ రంగప్ప తెలిపారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజు పల్లి ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమేష్ కుమార్ తెలిపారు. 2023 24 విద్యా సంవత్సరం గాను పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నేడు వాలంటీర్లకు సత్కారం

అమడగురు : మండల పరిధిలోని పలు పంచాయితీ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లకు ఈనెల 24న వందన సత్కార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కదిరి ఎంపిడిఒ తెలిపారు. కదిరి మండల పరిధి లోని కుమ్మరవండ్లపల్లి 1, కుమ్మరవండ్లపల్లి 2, కదిరి కుంట్లపల్లి, యర్రదొడ్డి, పట్నం, బురగపల్లి, మోటికపల్లి, ముత్యాల చెరువు, కెఎన్ పాళ్యం, కాలసముద్రం తదితర గ్రామాల ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు.

'వైసీపీ నాలుగేళ్ల పాలనలో ఒరిగిందేమీలేదు..'

ధర్మవరం టౌన్ : వైసీపీ నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిలేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని 38,39 వార్డులలో మంగళవారం నిర్వహించిన సేవ్ ధర్మవరం కార్యక్రమంలో పాల్గొన్న చిలకం మధుసూదన్ రెడ్డి ఇంటింటికి తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నాలుగేళ్లపాలనలో ప్రజలకు ఇంతవరకు ఏమిచేశారో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ఘనంగా గంటలమారెమ్మ జాతర

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి మండల పరిధిలోని బత్తలపల్లిలో గంటల మారెమ్మ జాతరను మంగళవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గోరంట్ల -ధర్మవరం ప్రధాన రహదారిలో కనుమ వద్ద వెలసిన గంటల మారెమ్మకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ జాతరలో గ్రామస్తులే కాక మండలంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి...

బుక్కపట్నం : మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మనీయమని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు పయనించాలని టిడిపి సీనియర్ నాయకులు పెద్దిరాసు సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్. పిసి గంగన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లా బకాష్, చెన్నకేశవులు, వేలూరు కేశన్న, రఘుపతి, శ్రీనాథ్, రామనాయుడు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

నల్లచెరువు : మండల పరిధిలోని తలమర్లవాండ్ల పల్లి గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి నల్లచెరువు కు చెందిన రియల్టర్ పాలెం సుధాకర్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన 20 వేల రూపాయలను మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేసారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిఎఫ్ఒ సామాజిక వన విభాగం శ్యామల పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద కమ్మవారి పల్లి సమీపంలో గల దీన జనార్ధారణ కాంప్లెక్స్ లో ప్రభుత్వ కార్యాలయాల అధికారులతో కలసి మేరీ లైఫ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణానికి హాని కలగకుండా సమతుల్యం పాటించాలన్నారు. పర్యావరణ సమతుల్యానికి ఏడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా ఆ కాంప్లెక్స్ లో ఉన్న 9 ప్రభుత్వ కార్యాలయాల అధికారులు సిబ్బందితో పర్యావరణ సమతుల్యం కాపాడటంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.

ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ

హిందూపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఇఇడిఎపి సంయుక్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగ ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యుమ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్కిన్ హబ్ తరపున మే 25వ తేదీ నుండి కస్టమర్ కేర్, ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సు, అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కోర్సులో చేరే వారు తప్పని సరిగా ఇంటర్, డిగ్రీ ఆపైన చదివి, ఆసక్తి కల్గిన యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 79815 41994, 9347189696 నంబర్‌కు కాని, హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా కాని సంప్రదించలన్నారు. శిక్షణ అనంతరం వీరికిఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

గోరంట్ల రూరల్: మండల పరిధిలోని కరావులపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న కరావలేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి గోరంట్ల ఎంపీపీ ప్రమీల మూర్తి ఆర్థికసాయం అందజేశారు. 25 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆలయ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

గోరంట్ల : పట్టణంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నాడు నేడు రెండో విడత కింద జరుగుతున్న పనులను ఎంపీడీవో రఘునాథ్ గుప్తా మంగళవారం పరిశీలించారు. అదే విధంగా ఎంఆర్‌సికి వచ్చిన జగనన్న విద్యా కానుకలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు

ఆమోదయోగ్యమైన ప్లాన్‌ను ఏర్పాటు చేయాలి

అమడగూరు : పట్టణంలో జరుగుతున్న ఫ్లైఓబర్ సమస్య ప్లాను మార్చి ఆమోదయోగమైన ప్లాను ఏర్పాటు చేయాలని ఏపీ మెప్మా అధ్యక్షులు హాజీ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు, ఏపీ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎప్పుడూ తమ సంస్థ ముందుంటుందన్నారు. ప్రభుత్వ అధికారులు వీటిపై స్పందించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడి ముస్లిం కమ్యూనిటీ నష్టపోకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇనాయతుల్లా నీసార్ ఆయాజ్ ,హుమేయర్ హబీబుల్లా మన్సూర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం పెంచాలి

ఓబుల దేవర చెరువు : కోడికొండ చెక్ పోస్ట్ నుండి మేదరమెట్ల వెళ్లే గ్రీన్ హైవే రోడ్డు సర్వేలో రోడ్డు కొరకు భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీధర్‌కు అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2.50 లక్షలను మాత్రమే ప్రభుత్వం ఇస్తోందని ఆదే నల్లమాడ ఏరియాలో ఎకరాకు రూ. 9. 50 లక్షలు ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి 10 లక్షల వరకు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, నాయకులు ఆంజనేయులు, చలపతి నాయుడు, చలపతి, గోవిందు,కొల్లాయప్ప,వెంకటేష్ ,సత్యనారాయణ ,రుద్రమ్మ, ప్రసాద్ రెడ్డి ,ఉత్తప్ప, వెంకటరమణ ,ప్రసాద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల పరిశీలన

బత్తలపల్లి : మండలంలో ఆదివారం రాత్రి వీచిన గాలులకు దెబ్బతిన్న విద్యుత్ స్థంబాలు, విద్యుత్ పునరుద్ధరణ పనులను అనంతపురం ట్రాన్స్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (అనంతపురం టౌన్, ఆపరేషన్) జేవీ రమణ, అనంతపురం రూరల్ ఈస్టు. ఆపరేషన్ కె.రఘులు పర్యవేక్షించారు. మంగళవారం మండలంలోని యర్రాయపల్లి, సంజీవపురం మధ్య జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈదురు గాలుల కారణంగా మండల వ్యాప్తంగా ఎన్ని స్తంభాలు నేలకూలాయి? ఎంత నష్టం వాటిల్లింది? తదితర వివరాలను వారు ట్రాన్స్‌కో ఎఇ శివయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : టిడిపి

పెనుకొండ, మడకశిర మండలాల్లో టిడిపి నాయకులు నిరసన

ప్రజాశక్తి - పెనుకొండ

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పార్థసారథి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు విద్యుత్ చార్జీల పెంపు, అనధికార విద్యుత్ కోతలకు నిరసనగా ఆందోలన నిర్వహించారు. ఈ సందర్భంగా బికె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకు 7 సార్లు ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి రూ. 37000 కోట్ల అదనపు భారం మోపిందనానరు. రైతుల మోటార్లకు మీటర్లు బిగించాలని ప్రణాళిక సిద్ధం చేశారని, రైతులు మోటార్లకు మీటర్లు బిగించడానికి వస్తే మీటర్లు ధ్వంసం చేయాలని అనానరు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, అనధికార విద్యుత్ కోతలను ఆపి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ, టీడీపీ నాయకులు చిన్నవెంకటరాముడు, రామక్రిష్టప్ప, కేశవయ్య, రఘువీర చౌదరి, అశ్వర్ధనారాయణ, హుజూర్, రామలింగనాయుడు, శ్రీనివాసులు, బోయ నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గోరంట్ల : విద్యుత్ కోతలు, ఛార్జీల పెంపునకు నిరసనగా పట్టణంలో గుమ్మయపల్లి సబ్‌స్టేషన్ వద్ద టిడిపి నాయకులు మంగళవారం ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల పెంపు, విద్యుత్ కోతలు వలన రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాస్‌కు అందజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్. హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి దేవా నరసింహప్ప, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, నాయకులు నీలకంఠ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మడకశిర పట్టణంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. విద్యుత్‌కోతలతో మల్బరి, వక్క తోటలు, పత్తి, వేరుశనగ పంటలు ఎండి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లో వోల్టేజీతో రైతుల మోటర్లు కాలిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, ఐదు మండలాల కన్వీనర్లు, టిడిపి నాయకులు , కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం. విద్యుత్ చార్జీల పెంపు, అనధికార విద్యుత్ కోతలకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో స్థానికవిద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, తాలుకా అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణతో పాటు అధికసంఖ్యలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అభివృద్ధి పనుల లక్ష్యాలను అధిగమించడానికి మండలాల ప్రత్యేక అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 25న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ లో అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని, పురోగతి కనిపించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు పర్యటించి పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమానికి చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నాడు నేడు పనులు వేగవంతం చేయాలని ఏమైనా పెండింగ్లో ఉంటే వాటిని మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. బాలింతల సర్వేలో సాంఘిక సంక్షేమం అసిస్టెంట్లు, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సమాచారాన్ని సేకరించాలన్నారు. 6 నుంచి 19 సంవత్సరాల పిల్లలు, 0 - 5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన పిల్లలకు సత్వరమే జనన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు జిల్లాస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సిపిఒ విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పీడీ నిర్మలజ్యోతి, నోడల్ అధికారి శివారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా వాప్తంగా కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కురువ సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ, హిందూపురం తాలూకా కురువ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రెడ్డప్ప, గౌరవాధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ మంగళవారం మాట్లాడుతు ప్రతి సంవత్సరం కురువ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 450కి పైగా, ప్రవేటు పాఠశాల విద్యార్థులు 475 మార్కులు, ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేసిన వారు 800, ప్రవేటు కళాశాల విద్యార్థులు 850 మార్కులకు పైగా సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. వీరితో పాటు నీట్, జెఈఈలో ప్రతిభ కనబర్చిన వారిని అభినందిస్తున్నామన్నారు.

ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలపై రిలేదీక్షలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతినెల 1వతేదీన వేతనాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాంనాయుడు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బాస్కర్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కమిటి పిలుపు మేరకు మంగళశారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉద్యోగ వ్యతిరేకవిధానాలపట్ల దీక్షలు చేపడుతున్నామన్నారు. అధికారంలో వచ్చాక వారం రోజుల్లో సీపీఎస్ రద్దుచేస్తామని హామీ ఇచ్చి నేటికీ ఆ హామీని నెరవేర్చకపోవడం దారుణమన్నారు. బకాయిపడ్డ డీఎలు, అరియర్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇంతవరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దీక్షలో ఉద్యోగులసంఘం జిల్లా కార్యదర్శి బాబాపక్రుద్దీన్, ధర్మవరం తాలూకా అధ్యక్షులు శివయ్య, కార్యదర్శి మహేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

తనకల్లు, పెనుకొండలో వాలెంటీర్ల సన్మాన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - తనకల్లు

ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వాలంటీర్ల సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ వద్దగల పోలం సిద్ధారెడ్డి ఫంక్షన్ హాల్ నందు మంగళవారం ఉత్తమ వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి రెండు వేల కుటుంబాలకు ఒక సచివాలయాన్ని, ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చారన్నారు. ఈ వ్యవస్థలో దాదాపు నాలుగు లక్షల మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను పెన్షన్ నుండి దాదాపు 33 రకాలైన సంక్షేమ కార్యక్రమాలను అర్హత కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి చేరవేయడంలో వాలంటీర్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏడాది కూడా వాలంటీర్ల సేవలకు సేవ వజ్రా, సేవా రత్న మరియు సేవమిత్ర అవార్డులతో సత్కరిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సులభతరంగా ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్లు ముందుండి వారి సేవలు ప్రజలకు అందజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూల నరసింహులు, ఎంపీపీ కౌసల్య, వైసిపి మండల నాయకుడు కొక్కంటి శ్రీనివాసులు నాయుడు, మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, రామ్ దేశాయ్, బిఎస్ నిజాం హేమ శేఖర్ రెడ్డి మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరుస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం భవనంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, వివక్షకు తావు లేకుండా సేవలు అందిస్తున్న వాలంటీర్ల సేవలు గుర్తించి ప్రభుత్వం ప్రోత్సాహకంగా వాలంటీర్ల కు సేవమిత్ర, సేవారత్న, సేవ వజ్ర కింద అవార్డులు అందిస్తోందని తెలిపారు. అనంతరం వాలంటీర్లను ఎమ్మెల్యే సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ శంకరప్ప, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, వైసిపి మండల కన్వీనర్ బాబు, సచివాలయం కన్వీనర్ శ్యామ్ నాయక్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి,మునిమడుగు శ్రీనివాసులు, కొండల రాయుడు, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై వేధింపులు సరికాదు

పుట్టపర్తి క్రైమ్:- జిల్లాలో యువతకు ఉపాధి కరువై ఆటోలు నడుపుకుంటూ జీవిస్తున్నారని ఈ నేపథ్యంలో ఆటో కార్మికులను పోలీసులు, రవాణా శాఖ అధికారుల వేధిస్తున్నారని ఈ వేధింపులను అరికట్టాలని జిల్లా రవాణా రంగం సిఐటియు అనుబంధ నాయకులు కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో చాలామంది కుటుంబ పోషణకై ఆటోలు నడుపుకుంటున్నారన్నారు. అయితే ఆటో డ్రైవర్లను పలు రకాలుగా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఓవర్ లోడ్ అని, యూనిఫామ్ లేదని, ఫోన్లో మాట్లాడుతున్నారని, రికార్డ్స్ సరిగా లేవని, అతివేగమని, అజాగ్రత్త అని జిల్లాలో ఏదో వంకతో కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆర్టీవో పోలీస్ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశామన్నారు. ఈ చలానాలు రద్దు చేయాలని, ఆటోకార్మికులకు ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఆటో డ్రైవర్ల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్ పోర్ట్ రంగం కార్యదర్శి బాబా, రాష్ట్ర నాయకులు రఫీ, రామకృష్ణ, నరసింహారెడ్డి, పై పల్లి గంగాద్రి, రాము, సిఐటియు నాయకులు గౌస్ లాజం తదితరులు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి : ఆర్డీవో

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రైతులు కంపెనీకి సహకరిస్తే ఉపాధి కలుగుతుందని ఆర్డీవో తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం చెన్నేకొత్తపల్లి మండలంలోని రైతులు, రెవెన్యూ అధికారులతో ఆర్డీవో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం చెన్నేకొత్తపల్లి మండలంలో ఎపిఐఐసిఎస్ అనే కంపెనీని నిర్మాణం చేపడుతోందన్నారు. సర్వేనెంబర్లు 433, 435, 436, 497, 500, 503లలో దాదాపు 320 ఎకరాలలో ఈ కంపెనీ నిర్మాణం కావాల్సి ఉందన్నారు. 45 మంది రైతులు తమ భూములను ఇవ్వాల్సి ఉందని వివరించారు. రైతులు సహకరిస్తే తగిన ఉపాధి కలుగుతుందని వివరించారు. కంపెనీ వస్తే భవిష్యత్తులో నిరుద్యోగ సమస్య తీరే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరాకు రూ. 35 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ఆర్డీవోను కోరారు. ప్రభుత్వం రూ. 25 లక్షలు మాత్రమే ఇస్తుందని తెలిపారు. రైతులు అంగీకరించకపోవడంతో రైతుల సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకెళతానని ఆర్డీవో రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఐతిజున్, హంపయ్య, చెన్నేకొత్తపల్లి తహశీల్దార్ సుబ్బలక్ష్మి, కంపెనీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, సీఎస్డీటీ అనురాధ. వీఆర్వో తులసమ్మ, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

హిందూపురం : పట్టణంలోని కొటిపి రోడ్డు ఆర్‌టిఒ కార్యాలయ సమీపంలో మంగళవారం ఒక యువకుడు అనుమానస్పద స్థితిలో మృతిచెందాడు. అటుగా వెళుతున్న వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మృతదేహాన్ని పరిశీలించారు. మృతిచెందిన యువకుడి పేరు దాదాపీర్ అలియాస్ ముక్కులు అని ఇతని వయస్సు 19-21 సంవత్సరాల మధ్య ఉంటుందని టూటౌన్ ఇన్‌ఛార్జి సిఐ కృష్ణారెడ్డి తెలిపారు.

సైకోపై ఫిర్యాదు

పుట్టపర్తి రూరల్ : పుట్టపర్తి మండల పరిధిలోని రాచువారి పల్లి గ్రామంలో పశువులపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. రాచు వారి పల్లి గ్రామానికి చెందిన భక్తవత్సలం అనే వ్యక్తి తరచూ రాత్రివేళల్లో మద్యం సేవించి లేగ దూడల పైన లైంగిక దాడులు చేసేవాడని గ్రామానికి చెందిన పలువురు అతడిని పలుమార్లు మందలించిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు. ఇదే క్రమంలో సోమవారం రాత్రి 11:30 సమయంలో రామాంజనేయులు, రూపకి చెందిన గడ్డివామిలో ఉన్న పశువులపై భక్తవత్సలం లైంగిక దాడి చేస్తుండగా వారు ప్రత్యక్షంగా చూసి మందలించారు. దీంతో ఆ సైకో వారిపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. దీంతో రామాంజినేయులు, రూప విషయాన్ని పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సుజాత, రామయ్య, కుమార్ సాబ్ నరసింహులు పోతన్న తదితరులు కోరారు.

నిందితులు అరెస్టు

లేపాక్షి : వాహనదారులను తాము పోలీసులని బెదిరించి నగదును లాక్కొన్న నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. లేపాక్షి మండలం మైదుగోళం గ్రామం బయట ఆదివారం మధ్యాహ్నం హిందూపురంలోని శ్రీకంఠపురానికి చెందినతిప్పన్న కొడుకు రమేష్ అను అతను తన ఆటోను బాగేపల్లి తాలూకా, సాదార్లపల్లి కి బాడుగకు పోయి హిందూపురానికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆటోని ఆపి తాము పోలీసులమని చెప్పి వాహనం రికార్డులు చూపించాలని అడిగారు. ఈసమయంలో రమేష్‌కు మారణాయుధాలు చూపించి అతని వద్ద నుంచి వెయ్యిరూపాయల నగదును లాక్కొన్నారు. అలాగే అటువైపుగా వస్తున్న మరొక కారును ఆపి అతనిని కూడా ఇలాగే బెదిరించి అతని వద్ద నుంచి రూ.3వేలు లాక్కొన్నారు. ఈ ఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులైన మైదుగోళం గ్రామానికి చెందిన కృష్ణ, అశోక్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేశారు. వారిలో కృష్ణ, అశోక్‌ను మంగళవారం అరెస్టు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

నల్లమాడ : రసాయనిక ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విక్రయాలలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో సుమతి సంబంధిత డీలర్లను హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని ఫర్టిలైజర్స్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. నాణ్యత గల ఎరువులు పురుగుమందులనే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సరుకుల స్టాకు రికార్డుల నిర్వహణ విధిగా ఉండాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు వీలైనంత ప్రయోజనం కలిగేలా తోడ్పాటు అందించాలన్నారు. సరుకుల నిలువ బోర్డులను విధిగా ఉంచాలన్నారు. సరుకుల క్రయ విక్రయాల రికార్డుల నిర్వహణ రోజువారిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీలర్లు సూర్యనారాయణ రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, రాజారెడ్డి, రమణ, ఎంపిఇఒలు రాధమ్మ, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం

లేపాక్షి : జర్నలిస్టులపై దాడులు అమానుషమని స్థానిక విలేకరులు అన్నారు. జర్నలిస్టులపై ఎంపీ అవినాష్ రెడ్డి అనుచరుల దాడికి నిరసనగా మంగళవారం లేపాక్షి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అఖిలపక్షం మద్దతుతో బస్టాండ్ ఆవరణంలోనిఅంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్, కాంగ్రెస్ మండల కన్వీనర్ రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి శివప్ప, బిజెపి బద్రి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్స్ నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం

ధర్మవరం టౌన్ : పట్టణంలో పవర్ లూమ్స్ మగ్గాలపై దాడులు నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధులు విమర్శించారు. స్థానిక కదిరి గేటు వద్దగల బ్రహ్మంగారి పంక్షన్ హాల్‌లో మంగళవారం చేనేత నాయకులు, కార్మికులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం నుండి పట్టణంలో చేనేత చైతన్యయాత్రలు జరుగుతాయని, ప్రతి చేనేత కార్మికున్ని ఉద్యమ బాగస్వామిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అనానరు. మరమగ్గాల ఏర్పాటుపై శివారు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వాలని, అదేవిధంగా ప్యూర్ టూ ప్యూర్ నేసే పవర్లూమ్స్ సమాచారాన్ని ఇవ్వాలన్నారు.ఈ సమావేశంలో చేనేత నాయకులు ఊట్ల ప్రసాద్, మంజునాథ్, శ్రీదర్, చెన్నభుజంగం, గంగాధర్, గోవర్ధన్, సురేశ్, రామాంజినేయులు,మద్దిలేటి పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు విద్యార్థుల ఎంపిక

ధర్మవరం టౌన్ : ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి, ఇంటర్ చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంఇఒ సుధాకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలో 10వతరగతి, ఇంటర్లో అత్యధిక మార్కులు సాదించిన విద్యార్థులకు మూడుస్థానాలలో ఈనెల 25న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పదవతరగతిలో మొదటి బహుమతికింద మోడల్ స్కూల్కు చెందిన విద్యార్థులు జింక ఆదిశంకర్(586), మదనమురళీకృష్ణ(586) బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బాలసాయిప్రసాద్(586), రెండవ బహుమతికింద ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి కడపల కృష్ణతులసి(585), మూడవ బహుమతి కింద కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలకు చెందిన తాడిపత్రి ముబాశీరాలు ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా ఇంటర్లో మొదటి బహుమతికింద ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన నీరుగంటి లత(971), బాలుర జూనియర్ కళాశాలకు చెందిన సాకేమారెన్న (698), బాలికల జూనియర్ కళాశాలకు చెందిన గుజ్జులమౌనిక(902), పందెం వార్షిక (972) ఎంపికయ్యారని ఎంఇఒ తెలిపారు.

పోట్లమర్రి పంచాయతీలో నీటి కష్టాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని పోట్లమర్రి పంచాయతీ పరిధిలోని వేల్పుమడుగు, గంటాపురం గ్రామాలలో నీటి కష్టాలను తెలుసుకున్న తెలుగు యువత నాయకులు తళ్ళూరు సతీష్ కుమార్ చౌదరి ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. మంగళవారం నీటి ట్యాంకుర్లు బాడుగకు తీసుకొని గ్రామానికి నాలుగు ట్యాంకర్లు చొప్పున నీరు సరఫరా చేశారు. కరెంటు కష్టాలతో పంచాయతీ బోర్లు పనిచేయకపోవడం, సత్యసాయి కార్మికుల సమ్మెతో సత్యసాయి నీరు రాకపోవడం వల్ల గ్రామాలలో నీటి కష్టాలు తప్పడం లేదని పలువురు మహిళలు వాపోయారు. ఈ నేపథ్యంలో తెలుగు యువత నాయకుని ఔదార్యాన్ని అభినందిస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి పోట్లమర్రి పంచాయతీ పరిధిలోని గంటాపురం, వేల్పుమడుగు గ్రామాలలో నీటి కష్టాలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.,

బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కదిరి టౌన్ : 2022 - 23 విద్యా సంవత్సరంలో 550 మార్కులు పైన సాధించిన రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు. కదిరి పట్టణ బలిజ సేవా సంఘం అధ్యక్షులు చింతకుంట రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి దృడం శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ రాయలసీమ బలిజ మహా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాల పరిధిలోని బలిజ విద్యార్థులకు వచ్చే నెల 4న అనంతపురంలో శ్రీనివాస కళ్యాణ మండపం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రతిభ పురస్కారం అందజేస్తామన్నారు.